



మొలకెత్తిన ధాన్యం

వారం రోజుల నుంచి కురుస్తున్న వర్షాలకు ధాన్యం తడిసిముద్దవుతుండడంతో అన్నదాతలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మనోహరాబాద్ మండలంలోని దండుపల్లి కొనుగోలు కేంద్రంలో సంచులలో నింపిన ధాన్యం, తూప్రాన్ పట్టణంలోని సొసైటీ కేంద్రంలో ఆరబెట్టిన ధాన్యం తడిసిముద్దవడంతో మొలకలు వచ్చాయి.

- మనోహరాబాద్/తూప్రాన్, మే 28(ఆంధ్రజ్యోతి)



భరతనాట్యం చేస్తున్న యువతి

హోజాగిరి హొయలు

ఐఐటీహెచ్‌లో మూడో రోజూ సాంస్కృతిక హంగామా

అలరించిన సంప్రదాయ కళా ప్రదర్శనలు

'నా సొంత రాష్ట్రమైన త్రిపురలోని హోజాగిరి జానపద నృత్య కళా ప్రదర్శనను స్పిక్ మైకే అంతర్జాతీయ వేడుకలో ఏర్పాటు చేయడం, ఇది పదవీకాలంలో నాకు వ్యక్తిగత గర్వకారణంగా నిలుస్తుంది' అని తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ రెండు రోజుల క్రితం ఐఐటీహెచ్‌లో కళా వేడుకను ప్రారంభిస్తున్నప్పుడు అన్న మాటలివి. ఐఐటీహెచ్‌లో కొనసాగుతున్న అంతర్జాతీయ కళా వేడుకలో మూడోరోజైన బుధవారం ఇక్కడి ఆడిటోరియంలో ఈ హోజాగిరి నృత్యాన్ని ప్రదర్శించారు. కిక్కిరిసిన ఆడిటోరియంలో త్రిపుర రయాంగ్, మర్మ తెగల వారు హోజాగిరి జానపద కళావైభవాన్ని చాటారు.

7లో



త్రిపుర నాగరికతను తెలిపే హోజాగిరి నృత్యం చేస్తున్న కళాకారిణి



పశ్చిమబెంగాల్ తారాపద రజక్ పురులియా చౌ నాటక ప్రదర్శన

జిల్లా మహిళలను ప్రధాని గుర్తించడం గర్వకారణం

సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి



సంగారెడ్డి రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా మహిళలను ప్రధాని మోదీ గుర్తించడం గర్వకారణమని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అన్నారు. కలెక్టరేట్‌లో బుధవారం అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మన్ కీ బాత్ కార్యక్రమంలో జిల్లాలోని మహిళా స్కై వారియర్లపై ప్రస్తావించడం వారికి ఎంతో ప్రోత్సాహాన్నిచ్చిందన్నారు. నమో దీదీ డ్రోన్ పథకం ద్వారా డ్రోన్ శిక్షణ పూర్తి చేసిన 52 మంది స్కై వారియర్స్ గుర్తింపుతో ఉపాధి పొందుతున్నారన్నారు. డ్రోన్ శిక్షణ పొందిన మహిళలకు నెలకు రూ.10 వేల వరకు ఆదాయం పొందే అవకాశం కలిగిందని కలెక్టర్ తెలిపారు. ఇందిరా శక్తి కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 33 మంది మహిళల్లో 28 మంది అర్హత సాధించారన్నారు. మహిళా సమాఖ్య సభ్యులు విద్యార్థులకు పాఠశాలలు తెరవక ముందే యూనిఫాంలను అందించాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, డీఆర్డీఏ పీడీ జ్యోతి, అదనపు డీఆర్డీఏ జంగారెడ్డి, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

అర్హులనే ఎంపిక చేయండి

రాజీవ్ యువ వికాసంలో అర్హులనే ఎంపిక చేయాలని సంగారెడ్డి కలెక్టర్ వల్లూరు క్రాంతి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్ నుంచి బుధవారం నిర్వహించిన అధికారులతో టెలికాన్ఫరెన్స్‌లో ఆమె మాట్లాడారు. లబ్ధిదారుల ఎంపికను త్వరితగతిన, పారదర్శకంగా పూర్తి చేయాలన్నారు. రెండో విడత ఇందిరమ్మ ఇళ్ల జాబితా త్వరగా అందించాలన్నారు. వర్షాల వల్ల తాగునీరు, విద్యుత్ సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని ఆయా శాఖల అధికారులను ఆదేశించారు.

ఉమ్మడి జిల్లాలో భూభారతి పైలెట్ మండలాల్లో వచ్చిన దరఖాస్తులు దాదాపుగా ఏడు వేలు. అయితే, వీటిని పరిష్కరించడమే ఇప్పుడు అధికారులకు పెద్ద సవాల్‌గా మారింది. జూన్ 2వ తేదీ వరకు పరిష్కరించాలనే ఆదేశాలు ఉన్నప్పటికీ నెలల కొద్దీ సమయం పడుతుందని అధికారులే చెబుతున్నారు. ఉమ్మడి జిల్లాలో మూడు మండలాలకే ఈ పరిస్థితి ఉంటే మిగతా 72 మండలాల్లో సదస్సులు చేపట్టి దరఖాస్తులు స్వీకరించి వాటిని పరిష్కరించాలంటే ఇంకెంత సమయం పడుతోందోననే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.



సంగారెడ్డి జిల్లా కొండాపూర్ మండలంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో స్వీకరిస్తున్న దరఖాస్తులు

మూడు మండలాలు.. ఏడు వేల సమస్యలు

'భూభారతి' పైలెట్ మండలాల్లో దరఖాస్తుల వెల్లువ

- ఇందులో 25 శాతం సాదాబైనామావే
- పెద్ద సంఖ్యలో మిస్సింగ్ సర్వే నంబర్లు
- అసైన్డ్ భూముల వివాదాలూ ఎక్కువే
- అధికారులకు సవాల్‌గా మారిన పరిష్కారాలు
- జూన్ 2 తర్వాత అన్ని మండలాల్లో సదస్సులు

ఆంధ్రజ్యోతి ప్రతినిధి, సంగారెడ్డి, మే 28 : భూభారతిని అమలు చేయాలంటే ఆటంకంగా ఉన్న భూసమస్యలను పరిష్కరించడంపై రెవెన్యూ అధికారులు దృష్టి సారించారు. ముందుగా జిల్లాకు ఒక మండలాన్ని పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ఆ మండలంలోని అన్ని గ్రామాల వారీగా రెవెన్యూ సదస్సులు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించారు. సిద్దిపేట జిల్లాలో పైలెట్ మండలమైన అక్కన్నపేటలో 4,183, సంగారెడ్డి జిల్లాలోని

మిగతా 6వ పేజీలో



అక్కన్నపేట మండలంలో దరఖాస్తుల స్వీకరణ

సంగారెడ్డి జిల్లాలో

కొండాపూర్ మండలం

మొత్తం దరఖాస్తులు	1718
సాదాబైనామా	132
మిస్సింగ్ సర్వే నంబర్లు	566
డీఎస్ పెండింగ్	104
విస్తీర్ణం వివాదాలు	197
పీవోటీ భూములు	148
పెండింగ్ మ్యూటేషన్	94
కోర్టు కేసులు	609

సిద్దిపేట, మెదక్ జిల్లాలో

అక్కన్నపేట మండలం

మొత్తం దరఖాస్తులు	4,183
సాదాబైనామా	1630
అసైన్డ్ భూములు	413
పీవోటీ	691
అప్పీల్	296
శివాయి జమేదార్	246
మిస్సింగ్ సర్వే నంబర్లు	219
విరాసత్	214
విస్తీర్ణం వివాదాలు	153

చిలప్‌చెడ్ మండలం

మొత్తం దరఖాస్తులు	1045
సాదాబైనామా	255
పీవోటీ	90
మిస్సింగ్ సర్వే నంబర్లు	418
విరాసత్	88
విస్తీర్ణం వివాదాలు	193

హైవే ఆక్రమణలు

ఇరువైపులా సర్వీసు రోడ్డు దర్జాగా కబ్జా



తూప్రాన్ శివారులో సర్వీసు రోడ్డును కబ్జా చేసి పోసిన మట్టి

తూప్రాన్, మే 28 (ఆంధ్రజ్యోతి): హైవే రోడ్డు నిర్మాణ సమయంలో వదిలేసిన సర్వీసు రోడ్ల ఆక్రమణ యథేచ్ఛగా సాగుతుంది. మెదక్ జిల్లాలోని నాగ్‌పూర్ హైవే (44వ జాతీయ రహదారి) మనోహరాబాద్ మండలం కాళ్లకల్ నుంచి రామాయంపేట మండలం దామరచెర్వు వరకు సుమారు 55 కిలోమీటర్లు విస్తరించి ఉంది. రెండు వరుసల్లో ఉన్న హైవే రోడ్డును 2006లో నాలుగు వరుసల రోడ్డుగా విస్తరించారు. హైవే విస్తరణ సమయంలో మున్ముందు ఆరు వరుసల రోడ్డు వేసేందుకు అనువుగా ఇరువైపులా 250 (ఒక్కొక్క వైపు 125) అడుగుల భూమిని సేకరించారు. నాలుగు వరుసల రోడ్డు వేయడంతో ఇరువైపులా ఉన్న స్థలాలను సర్వీసు రోడ్లను నిర్మాణం చేస్తామని ప్రారంభంలో పేర్కొన్నారు. మరో రెండు వరుసల రోడ్డు కోసం ఇరువైపుల సేకరించిన భూమిలో సర్వీసు రోడ్లను ఆయా గ్రామాల ప్రజలకు ఉపయోగించుకోడానికి ప్రస్తుతం వదలివేశారు. ప్రస్తుతం సాధారణ మార్గాలు ఉండటంతో రైతులు, ప్రజలు వినియోగించుకుంటున్నారు. అయితే, తూప్రాన్ పట్టణ పరిధి హైవే బైపాస్‌లో ఓ ప్రైవేటు విద్యాసంస్థ భారీ కట్టడాలు చేపట్టింది. కట్టడాలకు రోడ్డును ఏకంగా హైవే సర్వీసు రోడ్డేనే వినియోగించుకుంటు పనులు చేస్తుంది. అక్కడ హైవే రక్షణకు వేసిన ఫెన్సింగ్‌ను తొలగించేశారు. సర్వీసు రోడ్డుపై భారీగా మట్టి పోసి ఓ రోడ్డునే నిర్మాణం చేసుకున్నారు. అలాగే దాబా హోటళ్లకు ఎదురుగా కొత్త చెరువు వద్ద మరో రెండు వరుసల రోడ్డు కోసం సేకరించి, సర్వీసు రోడ్డుగా వదిలి వేసిన స్థలం కబ్జా చేసి భారీగా మట్టి పోశారు. హైవే పొడవునా రోడ్డు పక్కన

మిగతా 8వ పేజీలో



తూప్రాన్ వద్ద భవన నిర్మాణంలో కలిపేసుకున్న సర్వీసు రోడ్డు

ఆధునిక బోధన.. ప్రత్యక్ష శోధన

- రామచంద్రాపురంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీపై శిక్షణ
- రూ.42 కోట్లతో భవనాన్ని సిద్ధం చేసిన టాటా
- వచ్చే నెలలో ప్రారంభించేందుకు సన్నాహాలు

7



సంగారెడ్డి ఎంసీహెచ్‌లోని పీపీ యూనిట్

పీపీ యూనిట్లలో డాక్టర్ లేరు

సంగారెడ్డి, జోగిపేటలో మెడికల్ ఆఫీసర్లు కరువు.. కు.ని. ఆపరేషన్లు లక్ష్యానికి దూరం

సంగారెడ్డి అర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి) : మెడికల్ ఆఫీసర్లు కావలెను..! అవును మీరు విన్నది నిజమే. జిల్లాలోని పీపీ యూనిట్ల (ఫ్యామిలీ ప్లానింగ్, చిన్నారుల టీకాల విభాగం)లో డాక్టర్లు లేరు. సంగారెడ్డి జిల్లాలోని సంగారెడ్డి, జోగిపేట, జహీరాబాద్ ప్రభుత్వ ఆస్పత్రుల్లో పీపీ యూనిట్లు ఉన్నాయి. వాటిలో జహీరాబాద్ తప్పా సంగారెడ్డి, జోగిపేట పీపీ యూనిట్లలో ఒక్క రెగ్యులర్ డాక్టర్ కూడా లేరు. సంగారెడ్డి పీపీ యూనిట్‌లో రెండు మెడికల్ ఆఫీసర్ పోస్టులు మంజూరు ఉండగా, ఒక మెడికల్ ఆఫీసర్‌ను ఇతరత్రా కారణలతో డైరెక్టర్ ఆఫ్ హెల్త్‌కు సరెండర్ చేశారు. ఉన్న ఒక్క మరో డాక్టర్‌ను 2025 మార్చి 19 నుంచి నేరేడిగుంట పీహెచ్‌సీకి డిప్యూటేషన్‌పై పంపినట్టు అధికారులు తెలిపారు. దీంతో ప్రస్తుతం రెండు నెలలుగా ఇక్కడ ఒక్క డాక్టర్ లేకుండా పోయారు. ఇక జోగిపేట ఆస్పత్రిలోని పీపీ యూనిట్‌లో మూడేళ్ల నుంచి రెగ్యులర్ మెడికల్ ఆఫీసరే లేరు. దీంతో తాలెల్మ పీహెచ్‌సీ మెడికల్ ఆఫీసర్‌కే జోగిపేట పీపీ యూనిట్ మెడికల్ ఆఫీసర్‌గా

మిగతా 8వ పేజీలో



సంగారెడ్డి ఎంసీహెచ్‌లోని పీపీ యూనిట్‌లో ఖాళీగా దర్శనమిస్తున్న మెడికల్ ఆఫీసర్ కుర్చీ

అమీన్‌పూర్‌లో 25 ఎకరాల్లో యంగ్ ఇండియా స్కూల్

రూ.200 కోట్లు మంజూరు

పటాన్‌చెరు, మే 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ముందుగా 20 నియోజకవర్గాల్లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్ (వైఐఐఆర్‌ఎస్) విద్యాసంస్థలను ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయించింది. ఉమ్మడి మెదక్ జిల్లాలో పటాన్‌చెరు నియోజకవర్గంలో నెలకొల్పనున్నారు. అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలో 993 సర్వేనంబర్‌లో సుమారు ఐదు వందల కోట్ల విలువైన 25 ఎకరాల భూమిని పాఠశాల కాంప్లెక్స్ నిర్మాణానికి కేటాయించారు. ఒక్కో పాఠశాలకు రూ.200 కోట్ల చొప్పున మొత్తం రూ.4000 కోట్ల కేటాయిస్తూ జీవో నెంబర్ 96ను జారీ చేశారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి మాట్లాడుతూ పటాన్‌చెరులో పాఠశాల ఏర్పాటుకు నిధులు మంజూరు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి దామోదర్‌రాజనర్సింహ, ఇన్‌చార్జి మంత్రి కొండా సురేఖకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



అమీన్‌పూర్‌లో కేటాయించిన స్థలం

ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేయండి

మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



దండుపల్లి ధాన్యం తరలింపును పరిశీలిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

తూప్రాన్/మనోహరాబాద్/చేగుంట, మే 28 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోలు పూర్తి చేసి, త్వరితగతిన మిల్లులకు తరలించాలని మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. బుధవారం ఆయన తూప్రాన్, మనోహరాబాద్, చేగుంట మండలాల్లో పర్యటించారు. మనోహరాబాద్ మండలం దండుపల్లిలోని కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన కలెక్టర్ ధాన్యం కొనుగోళ్లను త్వరగా పూర్తిచేయాలన్నారు. ఇప్పటివరకు 2,80,751 మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి, 55,855 మంది రైతులకు రూ.520.25 కోట్లను చెల్లించామన్నారు. తూప్రాన్ కొనుగోలు కేంద్రాన్ని సందర్శించి ధాన్యం తడవకుండా చర్యలు తీసుకుంటూనే కొనుగోలు చేపట్టాలని నిర్వహకులను కలెక్టర్ ఆదేశించారు. తూప్రాన్ పట్టణంలో నిర్మించిన ఇందిరమ్మ మోడల్ ఇంటిని గృహనిర్మాణ శాఖ పీడీ మాణిక్యంతో కలిసి పరిశీలించారు. పట్టణ పరిధిలో అర్ధాంతరంగా నిలిచిపోయిన ఐవోసీ భవన సముదాయం, ఇంటిగ్రేటెడ్ మార్కెట్ భవనాన్ని పరిశీలించారు. చేగుంట మండల కేంద్రంలోని శ్రీనివాస ఎరువుల దుకాణంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేసి రికార్డులను, స్టాక్ బుక్‌లను పరిశీలించారు.



నాగల్‌గిద్ద మండలం సక్రూ తండాలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో జొన్నలను తూకం వేస్తున్న నిర్వాహకులు

జొన్నల పైసలేవి?

పంట అమ్మినా.. ఖాతాల్లో పడని డబ్బు

31న కేంద్రాలను నిలిపి వేసే అవకాశం

సంగారెడ్డి టౌన్/మునిపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా వ్యాప్తంగా 25 జొన్నల కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ఏర్పాటు చేసి క్వింటాల్‌కు రూ.3,371 మద్దతు కల్పించి కొనుగోళ్లు చేస్తోంది. అయితే, పంటను విక్రయించిన రైతులకు ఖాతాల్లో డబ్బులు జమ కాకపోవడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా 25 కేంద్రాలకు గాను 18679.3 మెట్రిక్ టన్నుల జొన్నలను కొనుగోలు చేసినట్లు అధికార లెక్కలు చెబుతున్నాయి. కానీ, కొనుగోలు చేసిన జొన్నలు ట్రాన్స్‌పోర్టు కాకపోవడంతో ఎక్కడికక్కడ నిల్వ చేస్తున్నారు. గతేడాది జొన్నలను అమ్మిన 10 రోజుల్లోనే డబ్బులు ఖాతాల్లో పడ్డాయని, కానీ ఈ ఏడాది నెల రోజులు దాటినా డబ్బులు పడడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంట కోసం అప్పులు తెచ్చి పెట్టుబడి పెట్టిన రైతుల ఆర్థిక ఇబ్బందులతో సతమతమవుతున్నారు. కాగా, రెండు రోజుల్లో సీసీఐ జొన్నల కొనుగోలు కేంద్రాలను బంద్ చేయాలని నిర్ణయించింది. కానీ రైతులు మాత్రం జూన్ 10వ తేదీ వరకు సీసీఐ కొనుగోలు కేంద్రాలను కొనసాగించి, తడిసిన జొన్నలను సైతం కొనుగోలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రస్తుతం కురుస్తున్న వర్షాల కారణంగా చేతికొచ్చిన పంట ఇంకా పొలాల వద్దనే ఉందని, తడిసి నల్లబారుతుదని ఈ జొన్నలను కొనుగోలు చేస్తారా..? లేక కేంద్రాలకు తీసుకెళ్తే నిలిపి వేస్తారా అని రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

వేర్వేరు ఘటనల్లో నలుగురి బలవన్మరణం

ఉమ్మడి మెదక్ జిల్లాలో బుధవారం చోటు చేసుకున్న వేర్వేరు ఘటనల్లో నలుగురు బలవన్మరణం చెందారు. మృతుల్లో ఇద్దరు మద్యం, జల్సాలకు అలవాటుపడి ఉరేసుకోగా, పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉన్న యువకుడు మనోవేదనతో చెరువులో దూకాడు. మరోవ్యక్తి అనారోగ్యం, ఆర్థిక ఇబ్బందుల కారణంగా పురుగులమందు తాగి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు. దీంతో ఉమ్మడి జిల్లాలోని ఆయా ప్రాంతాల్లో విషాదం నెలకొన్నది.

- చేర్యాల/గజ్వేల్‌రూరల్/హవేళిఘణపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి)

కొమురవెల్లిలో మద్యానికి బానిసైన వ్యక్తి..

కొమురవెల్లి మండలకేంద్రంలో మద్యానికి బానిసైన వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య పద్మ ఫిర్యాదు మేరకు వివరాలు ఇలా ఉన్నాయి.. కొమురవెల్లికి చెందిన కొయ్యడ వెంకటేశ్(45)కొంత కాలంగా మద్యానికి బానిసయ్యాడు.రోజూ డబ్బుల కోసం భార్యను వేధిస్తున్నాడు. ఈ క్రమంలో మంగళవారం రాత్రి భార్యతో గొడవపడి ఇంట్లో గదిలోకి వెళ్లి గడియపెట్టుకున్నాడు. దీంతో భార్య పద్మ ఇంటి ఆవరణలోనే మరోచోట నిద్రించినట్లు పేర్కొంది. బుధవారం ఉదయం గది తలుపులు తీయకపోవడంతో భార్యకు అనుమానం కలిగి చుట్టుపక్కలవారి సాయంతో తలుపులు ధ్వంసం చేసి ఇంట్లో పరిశీలించగా ఉరేసుకుని వేలాడుతున్న వెంకటేష్ మృతదేహం కనిపించింది. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ రాజు తెలిపారు.

కేసులకు భయపడి..

గజ్వేల్ మండలపరిధిలోని సింగాటంలో ఓ యువకుడు చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామస్థులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన అందోల్ నర్సయ్య అంజమ్మ దంపతుల కుమారుడు కృష్ణ(26) కొన్ని రోజులుగా తూప్రాన్ పరిధిలోని ఓ విత్తన పరిశ్రమలో పనిచేస్తున్నాడు. ఈ నెల 26న సింగాటం గ్రామానికి చెందిన ఓ వ్యక్తితో కలిసి ఆటోలో బయలుదేరిన కృష్ణ మార్గమధ్యంలో పిడిచెడ్‌లో దిగాడని సదరు వ్యక్తి చెప్పినట్టు కుటుంబీకులు తెలిపారు. ఇంటికి రాకపోవడంతో కుటుంబీకులు వెతికినా ఆచూకీ లభించలేదు. బుధవారం గ్రామంలోని లింగచెరువులో ఓ వ్యక్తి మృతదేహాన్ని గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారమందించారు. గ్రామస్థుల సాయంతో పోలీసులు మృతదేహాన్ని బయటకు తీసి కృష్ణ మృతదేహమని నిర్ధారించారు. చెరువుకట్ట వద్ద బూట్లు, బ్యాగ్‌తో పాటు సెల్‌ఫోన్ లభ్యమయ్యాయి. కృష్ణ మృతదేహాన్ని గజ్వేల్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మృతుడు కృష్ణ పలు చోరీ కేసుల్లో నిందితుడిగా ఉండడంతో కేసులకు భయపడి, మనోవేదనతో చెరువులో దూకి ఆత్మహత్యకు పాల్పడ్డాడని మృతుడి కుటుంబ సభ్యులు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నారు.


సింగాటంలో మృతి చెందిన కృష్ణ(ఫైల్), వెంకటేశ్ మృతదేహం

హవేళిఘణపూర్ మండలంలో ఇద్దరు..

హవేళిఘణపూర్ మండలంలో జరిగిన వేర్వేరు ఘటనల్లో ఓ యువకుడు జల్సాలకు అలవాటు పడి ఉరేసుకోగా. మరో వ్యక్తి ఆర్థిక ఇబ్బందులు, అనారోగ్యంతో పురుగులమందు తాగాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. తొగిట గ్రామానికి చెందిన ఎలబోయిన సురేష్(22) ఏ పని చేయకుండా జులాయిగా తిరుగుతూ జల్సాలకు అలవాటుపడ్డాడు. తన ఖర్చులకు డబ్బులు ఇవ్వాలంటూ తల్లి సత్యమ్మను అడుగగా నిరాకరించింది. దీంతో మనస్థాపం చెందిన సురేష్ బుధవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు మృతదేహాన్ని మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మరో ఘటనలో.. మండలంలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన నార్ల బాలయ్య(45) వ్యవసాయం చేసుకుంటూ జీవించేవాడు. కొన్ని రోజులుగా అనారోగ్య సమస్యలు, ఆర్థిక ఇబ్బందులతో తీవ్రంగా బాధపడుతూ ఈ నెల 25న పొలం వద్ద పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. కుటుంబీకులు బాలయ్యను మెదక్ ప్రభుత్వాసుపత్రికి తీసుకెళ్లారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతి చెందాడు. ఆయా ఘటనలకు సంబంధించి మృతుల కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు జరుపుతున్నట్టు ఎస్‌ఐ సత్యనారాయణ తెలిపారు.

ద్విచక్ర వాహనం అదుపు తప్పి వ్యక్తి మృతి

చిన్నశంకరంపేట, మే 28 (ఆంధ్రజ్యోతి): ద్విచక్ర వాహనం అదుపుతప్పిన ఘటనలో ఓ వ్యక్తి తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన మండలంలోని మిర్జాపల్లి తండాలో బుధవారం సాయంత్రం చోటుచేసుకుంది. ఎస్‌ఐ నారాయణగౌడ్ తెలిపిన వివరాల ప్రకారం.. తండాకు చెందిన కాత్రోత్ రాజు(45)మిర్జాపల్లి రైల్వేస్టేషన్ కాలనీలో నివాసముంటున్నాడు. సాయంత్రం స్వగ్రామమైన మిర్జాపల్లి తండాకు ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. రైల్వే అండర్ బ్రిడ్జి వద్దకు రాగానే కుక్క అడ్డు రావడంతో దాన్ని తప్పించబోయి వాహనం అదుపు తప్పింది. ఈ క్రమంలో రైల్వే హైట్ గేజ్‌ను ఢీకొని తలకు తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య చాంది, ఒక కూతురు, ఒక కుమారుడు ఉన్నారు. భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం రామాయంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

దామరకుంట భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడి ప్రదర్శన.. మరోసారి రాష్ట్రస్థాయికి ..


జిల్లా విద్యాధికారితోదామరకుంట ఉపాధ్యాయుడు చిన్న బ్రహ్మయ్య

మర్కుక్, మే 28 (ఆంధ్రజ్యోతి): పాఠశాల అభివృద్ధిలో వివిధ అభ్యసన పద్ధతులు(బెస్ట్ ప్రాక్టీస్)లలో ఉత్తమ ప్రదర్శన కనబరిచిన ఉపాధ్యాయుల విభాగంలో జడ్పీ ఉన్నతపాఠశాల దామరకుంట భౌతికశాస్త్ర ఉపాధ్యాయుడు చిన్నబ్రహ్మయ్య ఎంపికయ్యారని మండల విద్యాధికారి వెంకటరాములు బుధవారం తెలిపారు. జిల్లా స్థాయిలో 78 మంది ఉపాధ్యాయులు ఈ ప్రదర్శనలో పాల్గొనగా రాష్ట్రస్థాయికి జిల్లా నుంచి ముగ్గురిని ఎంపిక చేశారని వారిలో చిన్న బ్రహ్మయ్య ప్రథమ స్థానంలో నిలిచారని ఎంఈవో పేర్కొన్నారు. చిన్నబ్రహ్మయ్య ఉత్తమ ప్రదర్శనలో భాగంగా ఏ టు జెడ్ సైన్స్ కాన్సెప్ట్ గురు, స్టేట్ మ్యాజిక్, పటాల ద్వారా సైన్స్ అభివృద్ధి అనే పద్ధతుల ద్వారా విద్యార్థులకు సులభతరమైన బోధన చేయడంతో పాటు విద్యార్థుల పెంపుదలకు తోడ్పాటును అందించినందుకుగాను రాష్ట్రస్థాయికి ఎంపిక చేసినట్టు తెలిపారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయుడు చిన్న బ్రహ్మయ్యను పాఠశాల ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు బాల్‌రెడ్డి, పీఆర్టీయూ మర్కుక్ మండల అధ్యక్ష కార్యదర్శులు శ్రీనివాస్‌రావు, కుమార్ అభినందించారు.

తెల్లాపూర్‌లో నాలుగు బోరుబావులు సీజ్

రామచంద్రాపురం, మే 28 (ఆంధ్రజ్యోతి): రామచంద్రాపురం మండల పరిధి తెల్లాపూర్‌లో అక్రమంగా వేసిన బోరుబావులను సీజ్ చేసినట్టు తహసీల్దార్ సంగ్రాంరెడ్డి బుధవారం తెలిపారు. కలెక్టర్ ఆదేశాల మేరకు ఎలాంటి అనుమతులు లేకుండా నీటి దందా చేస్తున్న బోరుబావుల జాబితా ప్రకారం భూగర్భ, మున్సిపల్ శాఖ, పోలీసుశాఖలకు చెందిన అధికారులు ఈ దాడులు నిర్వహించారు. ఈ మేరకు తెల్లాపూర్‌లోని సర్వే నంబర్లు 396, 504లలో ఏర్పాటు చేసిన 4 బోరు బావులను పూర్తిగా మట్టితో పూడ్చివేసి సీజ్ చేశారు. బోరుబావులు ఏర్పాటు చేసుకునేవారు విధిగా ప్రభుత్వ అనుమతి తీసుకోవాలని తహసీల్దార్ సూచించారు.

మూడు మండలాలు.. ఏడు వేల సమస్యలు

(5వ పేజీ తరువాయి)

కొండాపూర్ మండలంలో 1,718, మెదక్ జిల్లాలోని చిలప్‌చెడ్ మండలంలో 1,045 దరఖాస్తులు వచ్చాయి. వీటిని పరిష్కరించడానికి ఎన్నాళ్లు పడుతుందో చూడాలి.

సాదాబైనామా దరఖాస్తులే 2వేలు

గత ప్రభుత్వ హయాంలో సాదాబైనామా ద్వారా భూములను క్రమబద్ధీకరించాలని నిర్ణయించారు. దరఖాస్తులు సైతం స్వీకరించారు. అయితే, ఆ దరఖాస్తులు ఏళ్ల తరబడిగా పెండింగ్‌లోనే ఉన్నాయి. ప్రస్తుత ప్రభుత్వం సాదాబైనామాలను పరిష్కరించడానికి చర్యలు చేపట్టింది. ఈ క్రమంలో పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన అక్కన్నపేట మండలంలో 1,630 సాదాబైనామా దరఖాస్తులు వచ్చాయి. అదే విధంగా కొండాపూర్ మండలంలో 132 దరఖాస్తులు, చిలప్‌చెడ్ మండలంలో 253 దరఖాస్తులు స్వీకరించారు. ఉమ్మడి జిల్లాలో వచ్చిన 7 వేల దరఖాస్తుల్లో 2 వేల దరఖాస్తులు సాదాబైనామావే ఉండడం గమనార్హం. వీటి పరిష్కారంలో అనేక వివాదాలు తలెత్తుతాయనే గత ప్రభుత్వం జాప్యం చేసింది. మరి ప్రస్తుతం ఇతర దరఖాస్తులతో పోల్చితే సాదాబైనామా దరఖాస్తుల పరిష్కారమే కత్తిమీద సాములా మారనున్నది.

పరిశీలనలో నిమగ్నం

గ్రామాల్లో స్వీకరించిన అన్ని రకాల దరఖాస్తులను ప్రస్తుతం అధికారులు పరిశీలిస్తున్నారు. ఈనెల 20వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించి రైతులు సమర్పించిన ప్రతీ దరఖాస్తును తీసుకున్నారు. దరఖాస్తుల్లో సమస్యల వారీగా విభజించారు. ఏయే సమస్యకు ఎన్ని దరఖాస్తులు వచ్చాయో లెక్కగట్టారు. ఇంచుమించు అన్ని గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి ఉంటుందని అంచనా వేశారు. అప్పటికప్పుడు కొన్ని దరఖాస్తులను పరిష్కరించారు. కోర్టు కేసుల్లో ఉన్న వాటిని రెండో దశలో పరిష్కరించడానికి పక్కన బెట్టారు. డీఎస్ పెండింగ్, పీవోబీ, పీవోటీ, మ్యూటేషన్, సర్వే నంబర్ మిస్సింగ్, పాస్‌బుక్‌లో పొరపాట్లను ముందుగా పరిష్కరిస్తే బాధితుల సంఖ్య తగ్గుతుందని భావించి ఆ దిశగా కసరత్తు చేస్తున్నారు.

జూన్ 2 నుంచి అన్నిగ్రామాల్లో..

ఇప్పటివరకు జిల్లాలో ఒక మండలాన్ని మాత్రమే పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. జూన్ 2వ తేదీ నుంచి అన్ని మండలాల్లోనూ రెవెన్యూ సదస్సులు నిర్వహించడానికి చర్యలు చేపట్టారు. అప్పటి వరకు పైలెట్ ప్రాజెక్టు గ్రామాల్లో స్వీకరించిన దరఖాస్తుల పరిష్కారంలో తలెత్తే ఇబ్బందులను పరిశీలిస్తున్నారు. వీటిని అధిగమిస్తేనే ఇతర గ్రామాల్లో పరిష్కారాల గురించి ఒక నిర్ణయానికి రావొచ్చని అనుకుంటున్నారు. ఇక రాబోయే నెలరోజుల్లో రెవెన్యూ యంత్రాంగమంతా గ్రామాల్లోనే ఉండబోతుంది.


పశ్చిమ బెంగాల్‌లోని ప్రాచీన తారాపద రజక్ పురూలియా చౌ నాటక ప్రదర్శన


త్రిపుర రాష్ట్రంలోని నాగరికతను తెలిపే హోజాగిరి నృత్యం చేస్తున్న కళాకారులు


ఆర్ట్స్ గ్యాలరీలోని చిత్రాలను పరిశీలిస్తున్న విద్యార్థినులు



హోజాగిరి హొయలు

ఐఐటీహెచ్‌లో మూడో రోజూ సాంస్కృతిక హంగామా
అలరించిన సంప్రదాయ కళా ప్రదర్శనలు
కొనసాగుతున్న స్పిక్ మైకే అంతర్జాతీయ వేడుక

కంది, మే 28 (ఆంధ్రజ్యోతి) : సంగారెడ్డి జిల్లా కంది పరిధిలోని ఐఐటీహెచ్‌లో స్పిక్ మైకే 10వ అంతర్జాతీయ సదస్సు మూడో రోజు బుధవారం కూడా ఉల్లాసభరితంగా కొనసాగింది. సాంస్కృతిక కార్యక్రమాలను ప్రత్యక్షంగా వీక్షించడానికి దేశ నలుమూలల నుంచి వచ్చిన కవులు, రచయితలు, సంగీత అభిమానులు, శాస్త్రీయ నృత్య కళాకారులు, సాహితీవేత్తలు, ఆయా పాఠశాలల విద్యార్థులతో ఐఐటీహెచ్ ప్రాంగణం జనసంద్రమైంది. ఆర్ట్స్ గ్యాలరీలో మహా కుంభమేళా చిత్రాలను ప్రదర్శించారు. తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి హఠ, నాద్ యోగా, ధ్యానం, భరతనాట్యం, సంగీత కచేరీలు జరిగాయి. దేబాసిస్ రియాంగ్ హోజాగిరి నృత్యం, తారాపద రజక్ పురూలియా చౌ, ప్రహ్లాద్ సింగ్ టిపానియా కబీర్ గయాన్, పండిట్ హరిప్రసాద్ చౌరాసియా (పద్మ విభూషణ్ అవార్డు గ్రహీత) వేణువు, అభిషేక్ రఘురామ్ కర్నాటిక్ వోకల్, విద్వాన్ యెల్లా వెంకటేశ్వరరావు మృదంగం అందర్నీ ఆకట్టుకున్నాయి. ఈ సదస్సుకు స్పిక్ మైకే జాతీయ చైర్‌పర్సన్ ఆర్.ఎం. తివారీ, ఐఐటీ హైదరాబాద్ అధ్యాపకులు, బ్రహ్మ కుమారీస్ సభ్యులు తదితరులు హాజరయ్యారు.

ప్రత్యేక ఆకర్షణగా హోజాగిరి నృత్య ప్రదర్శన

ఈశాన్య భారతదేశంలోని త్రిపుర రాష్ట్రంలో ప్రదర్శించే అనేక రకాల జానపద నృత్యాలలో హోజాగిరి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. రియాంగ్, మర్మ తెగలకు చెందినవారు ఈ నృత్యం చేసేటప్పుడు కళాకారులంతా సంప్రదాయ సంగీత వాయిద్యాలు మోగిస్తూ జానపద గీతాలు పాడారు. అమ్మాయిలు తమ తలలపై గాజు సీసాలను ఉంచి దానిపై వెలుగుతున్న దీపం పెట్టుకుని, కుండల మీద నిలబడి నృత్యం చేశారు. త్రిపురి (అతిపెద్ద ప్రాంతీయ జాతి సమూహం) మోగ్ ప్రజలు వార్షిక ప్రాంతీయ వేడుకలైన విత్తనాలు, పంటకోత పండుగల సమయంలో ప్రదర్శిస్తారని హోజాగిరి నృత్య బృంద సమన్వకర్త దేబాసిస్ రియాంగ్ తెలిపారు.


హిందుస్తానీ సంగీత కచేరీ


చౌటకూర్‌లో ధాన్యం బస్తాలను పరిశీలిస్తున్న డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బిజినెస్ మేనేజర్ ఆంజనేయులు

మొత్తం ధాన్యం కొంటాం

- రైతులు ఆందోళన చెందవద్దు
- లారీల కొరతతో ధాన్యం తరలింపునకు ఆటంకాలు
- ఇప్పటివరకు 1,77,360 క్వింటాళ్లు కొనుగోలు చేశాం
- డీసీఎంఎస్ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జి బిజినెస్ మేనేజర్ ఆంజనేయులు

పుల్కల్, మే 28 (ఆంధ్రజ్యోతి): ధాన్యం మొత్తాన్ని కొంటామని, రైతులెవరూ ఆందోళనకు గురికావొద్దని డీసీఎంఎస్ ఉమ్మడి మెదక్ జిల్లా ఇన్‌చార్జి బిజినెస్ మేనేజర్ ఆంజనేయులు తెలిపారు. మండల కేంద్రమైన చౌటకూర్‌లో బుధవారం కొనుగోలు కేంద్రాన్ని సందర్శించిన ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి జిల్లాలో డీసీఎంఎస్ అధ్వర్యంలో ఏర్పాటు చేసిన 31 కేంద్రాల్లో ఇప్పటివరకు 3081 మంది రైతుల నుంచి 1,77,360 క్వింటాళ్ల వరి ధాన్యం కొనుగోలు చేసినట్లు తెలిపారు. తడిసిన ధాన్యాన్ని కూడా కొంటున్నామన్నారు. సరిపడా టార్పాలిన్లు అందుబాటులో ఉంచామన్నారు. ధాన్యం కొనుగోళ్లలో ఎలాంటి నిర్లక్ష్యం లేదని తెలిపారు. కాంటా చేసిన ధాన్యాన్ని రైస్ మిల్లులకు రవాణా చేసేందుకు లారీల కొరత తీవ్రంగా ఉందని, ఈ సమస్యను పరిష్కరించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. చౌటకూర్ కేంద్రంలో మరో నాలుగు లారీలకు సరిపోను ధాన్యం బస్తాలు ఉన్నాయని తెలిపారు. రెండు, మూడు రోజుల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తి చేస్తామన్నారు. ఆయన వెంట కొనుగోలు కేంద్రాల పర్యవేక్షకులు వంశీ, సిబ్బంది కిరణ్, అశోక్, రైతులు పల్వాటి మల్లికార్జున్‌గౌడ్, బుచ్చాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

‘గోల్‌మాల్’ డబ్బుల వాపస్‌కు ఓకే

- 21,835 కిలోల ధాన్యం డబ్బులు చెల్లించేందుకు అంగీకారం

చేర్యాల, మే 28 (ఆంధ్రజ్యోతి) : కొమురవెల్లి మండలం మర్రిముస్త్యాల గ్రామంలోని కొనుగోలుకేంద్రంలో ధాన్యం తూకంలో మోసానికి పాల్పడి గోల్‌మాల్ చేసిన డబ్బులను తిరిగి రైతులకు చెల్లించేందుకు కేంద్రం నిర్వహకురాలు వందన అంగీకరించింది. దీంతో మూడు రోజులుగా చోటుచేసుకుంటున్న నాటకీయ పరిణామాలకు ఎట్టకేలకు తెరపడినట్లైంది. సాంద్రానంద గ్రామైక్య సంఘం ఆధ్వర్యంలో ఈ కొనుగోలు కేంద్రంలో 21,835 బస్తాలను కొనుగోలు చేశారు. నిర్వాహకురాలు వందన అవకతవకలకు పాల్పడుతుందన్న ఆరోపణలు రావడంతో అప్రమత్తమై పరిశీలించడంతో అసలు బాగోతం బయటపడింది. 17 ట్రక్‌షీట్లను పరిశీలించగా సుమారు 230 బస్తాల ధాన్యం పక్కదోవ పట్టించినట్లు ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు. అయితే రైతులంతా ఆందోళన వ్యక్తం చేయడంతో ఐకేపీ ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి విచారణ చేపట్టారు. బుధవారం గ్రామంలోని పాఠశాల ఆవరణలో వందనతో చర్చించారు. ప్రారంభం నాటి నుంచి తరలించిన ధాన్యం ట్రక్‌షీట్‌లను పరిశీలించారు. మొదటి నంబరు ట్రక్‌షీట్ నుంచి అదనంగా ధాన్యం బస్తాలు నమోదు చేయడాన్ని గమనించారు. దీంతో ధాన్యం విక్రయించిన రైతులందరికీ బస్తాకు ఒక్కో కిలో చొప్పున మొత్తం 21,835 బస్తాలకు సంబంధించి 21,835 కిలోల ధాన్యం డబ్బులు రూ.5.05 లక్షలు వాపసు చెల్లించాలనడంతో ఆమె అంగీకరించింది. భరోసా నిమిత్తం మంతెన మల్లారెడ్డిని మధ్యవర్తిగా సూచించి ఒప్పందపత్రాలు రాయించడంతో రైతులు ఆందోళన విరమించారు. ఇదిలా ఉండగా, మర్రిముస్త్యాల కేంద్రంలోని కాంటాలను పరిశీలించిన తూనికలు, కొలతలు అధికారులు అనంతరం కిష్టంపేట కేంద్రం కాంటాలనూ వెంట తీసుకుని వెళ్లారు. దీంతో అక్కడా అవకతవకలు ఆస్కారం ఉందని, అన్నీ కొనుగోలు కేంద్రాల్లోనూ విచారణ చేపట్టాలని రైతులు కోరుతున్నారు.


కొనుగోలుకేంద్రం నిర్వహకురాలు వందనను విచారిస్తున్న ఏపీఎం శ్రీనివాస్‌రెడ్డి

జాతీయ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మెదక్ జిల్లా క్రీడాకారులు

తూప్రాన్, మే 28(ఆంధ్రజ్యోతి): జాతీయ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు జిల్లా నుంచి నలుగురు ఎంపికైనట్లు అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కొడిప్యాక నారాయణగుప్తా, శ్యాంసుందర్‌శర్మ బుధవారం తెలిపారు. ఈ నెల 29 నుంచి జూన్ 2 వరకు చండీగఢ్‌లో జరగనున్న 43వ జాతీయ స్థాయి జూనియర్ సాఫ్ట్‌బాల్ చాంపియన్‌షిప్ పోటీల్లో తెలంగాణ రాష్ట్ర బాల, బాలికల జట్టుకు మెదక్ జిల్లాకు చెందిన కార్తీక, రాంచరణ్, నందులాల్, సుమన్ ఆడనున్నారని వివరించారు. క్రీడాకారులను వారితోపాటు ఉపాధ్యక్షుడు అజయ్‌కుమార్‌గౌడ్, కోశాధికారి గోవర్ధన్‌గౌడ్ అభినందించారు.


ఎంపికైన క్రీడాకారులతో శ్యాంసుందర్‌శర్మ


పుదుచ్చేరి దంపతులకు బాలికతోపాటు దత్తతకు సంబంధించిన అధికారిక పత్రాలను అప్పగిస్తున్న మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

బాలసదనం నుంచి పుదుచ్చేరికి..

- 13 ఏళ్ల పాపను దత్తత తీసుకున్న దంపతులు
- పిల్లలను చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలి
- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్ అర్బన్, మే 28(ఆంధ్రజ్యోతి): బాలసదనంలో ఆశ్రయం పొందుతున్న ఓ బాలికను పుదుచ్చేరి దంపతులు దత్తత తీసుకున్నారు. కలెక్టర్ రాహుల్ రాజ్ ఆధ్వర్యంలో ఆ బాలికను పుదుచ్చేరి దంపతులకు అప్పగించారు. మెదక్ జిల్లా కేంద్రంలోని బాలసదనంలో ఓ 13 ఏళ్ల బాలిక ఆశ్రయం పొందుతోంది. ఆ బాలిక వివరాలను కేంద్ర దత్తత వనరుల విభాగంలో ఆన్‌లైన్ చేయగా.. పుదుచ్చేరికి చెందిన దంపతులు సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీలో దరఖాస్తు పెట్టుకున్నారు. ఆ దరఖాస్తును పరిశీలించిన కేంద్ర దత్తత వనరుల విభాగం సీనియారిటీ ప్రకారం అడాప్షన్‌కు అంగీకరించింది. కలెక్టర్ రాహుల్ రాజ్ ఆధ్వర్యంలో బాలికను ఆ దంపతులకు అప్పగించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. పిల్లలు లేని దంపతులు చట్టబద్ధంగా దత్తత తీసుకోవాలన్నారు. అనంతరం బాలలపై జరిగే అఘాయిత్యాలను అరికట్టండి అనే కరపత్రాలను కలెక్టర్, అదనపు కలెక్టర్ నగేష్, మెదక్ జిల్లా సంక్షేమాధికారి హైమావతి చేతుల మీదుగా ఆవిష్కరించారు.


విజయం సాధించిన కేపీఎస్ అభ్యర్థి కొత్తగొల్ల చంద్రశేఖర్

‘ఎంఆర్‌ఎఫ్’ ఎన్నికల్లో కేపీఎస్ గెలుపు

సదాశివపేట, మే 28(ఆంధ్రజ్యోతి) : ఎంఆర్‌ఎఫ్ పరిశ్రమల్లో బుధవారం నిర్వహించిన కార్మిక సంఘం ఎన్నికల్లో కేపీఎస్(కార్మిక పోరాట సమితి) విజయం సాధించింది. ఆ సంఘం అభ్యర్థి కొత్తగొల్ల చంద్రశేఖర్ 139 ఓట్ల మెజార్టీతో గెలుపొందారు. మొత్తం 1,603 ఓట్లకు 1,575 పోలయ్యాయి. అందులో కేపీఎస్ అభ్యర్థి కొత్తగొల్ల చంద్రశేఖర్‌కు 584, సీఐటీయూ అభ్యర్థి చుక్క రాములుకు 445, బీఎంఎస్‌కు 382, టీడబ్ల్యూఎస్‌కు 164 ఓట్లు వచ్చాయి. కేపీఎస్ కర్మాగారం పరిసర ప్రాంతాల్లో కార్మికులు టపాసులు పేల్చి, స్వీట్లు పంచుకుని సంబురాలు జరుపుకొన్నారు.

ఆక్రమణలను పరిశీలించిన లోకాయుక్త


ఆక్రమణలను పరిశీలిస్తున్న లోకాయుక్త డైరెక్టర్ వెంకట్‌రావు

అమీన్‌పూర్, మే 28(ఆంధ్రజ్యోతి): అమీన్‌పూర్ మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనంబర్ 1000లోని ప్రభుత్వ భూమిని లోకాయుక్త డైరెక్టర్ ఆఫ్ ఇన్వెస్టిగేషన్ డాక్టర్ వెంకట్‌రావు బుధవారం పరిశీలించారు. గతంలో ప్రభుత్వ భూముల్లో ఆక్రమణలను ఆపాలని కోరుతూ హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ సంస్థ లోకాయుక్తను ఆశ్రయించింది. ఈ మేరకు వాస్తవాలను పరిశీలించేందుకు క్షేత్ర స్థాయిలో దర్యాప్తును ప్రారంభించారు. అమీన్‌పూర్ తహసీల్దార్ వై.వెంకటేశ్ ప్రభుత్వ స్థలం పరిస్థితిని లోకాయుక్త పరిశీలకులకు వివరించారు. ప్రభుత్వ భూమి రక్షణ కోసం తీసుకోవాల్సిన చర్యలు, ఏ మేరకు భూమి ఆక్రమణకు గురైంది, దాని విలువ ఎంత అనే ప్రశ్నలు వేసి డైరెక్టర్ సమాధానాలు రాబట్టారు. వాస్తవ పరిస్థితిని అంచనా వేసి లోకాయుక్తకు నివేదిక సమర్పిస్తామని పేర్కొన్నారు. విచారణకు స్థానిక మున్సిపల్ అధికారులు గైర్హాజర్ కావడం గమనార్హం. హ్యూమన్ రైట్స్ ప్రొటెక్షన్ సంస్థ తరఫున అడ్వకేట్ ఇంద్రజ తదితరులు హాజరయ్యారు.

ఆధునిక బోధన.. ప్రత్యక్ష శోధన

- రామచంద్రాపురంలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీపై శిక్షణ
- రూ.42 కోట్లతో భవనాన్ని సిద్ధం చేసిన టాటా
- వచ్చే నెలలో ప్రారంభించేందుకు సన్నాహాలు
- ఆరు కోర్సులు.. ఏటా 240 మందికి అవకాశం

మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా యువతరానికి సాంకేతిక పరిజ్ఞానం అందించడానికి జిల్లా అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. అందుకోసం రామచంద్రాపురంలో సామాజిక సేవా కార్యక్రమం కింద టాటా సంస్థ వారిచే రూ.42 కోట్లతో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ భవనాన్ని నిర్మించారు. ప్రస్తుతం ఇందులో ప్రత్యక్ష బోధనకు అవసరమైన పరికరాల అమరిక పనులు సాగుతుండగా వచ్చే నెలలో ప్రారంభానికి సిద్ధం చేస్తున్నారు. అర్హులైన యువతకు ఆరు కోర్సుల్లో ఉచిత శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించనున్నారు.

-రామచంద్రాపురం టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి)

పటాన్‌చెరు నియోజకవర్గంలో పరిశ్రమలు అధికంగా ఉండటంతో యువతకు సాంకేతికతలో ఉచిత శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలను మెరుగుపర్చాలని అధికారులు నిర్ణయించారు. ఆగస్టు నుంచి తరగతులు ప్రారంభించడానికి సన్నాహాలు చేస్తున్నారు. దీనికోసం రామచంద్రాపురంలోని బీరంగూడ కమాన్ పక్కనే ఐటీఐ విభాగం వెనుకవైపు స్థలంలో టాటా సంస్థ వారు రూ.42 కోట్లు అంచనా వ్యయంతో 10 వేల అడుగుల్లో భవనం నిర్మించారు. ప్రత్యేక తరగతి గదుల నిర్మించి, కోర్సులకు అవసరమైన అన్ని రకాల పరికరాలు ఏర్పాటు చేస్తున్నారు. టాటా సంస్థనే ఐదేళ్ల పాటు నిర్వహణ బాధ్యతలు చేపట్టనున్నది. ఐదేళ్ల కాలంలో ప్రభుత్వ విభాగంలో పని చేస్తున్న అధ్యాపకులకు నిత్యం శిక్షణ ఇస్తారు. ప్రిన్సిపాల్ స్థాయి అధికారి పూర్తి బాధ్యతలు చేపడుతారు.

ఏటా 240 మందికి అవకాశం

ఆధునిక పద్ధతుల్లో బోధన చేసేందుకు వీలుగా ఆరు కోర్సులకుగాను ఆరుగురు అధ్యాపకులను నియమించారు. మెకానికల్ ఎలక్ట్రిక్ వెహికల్ కోర్సులో భాగంగా మార్కెట్‌లో తిరుగుతున్న ఎలక్ట్రిక్ వాహనాల మరమ్మతులు, తయారుచేసే విధానాలపై శిక్షణ ఇవ్వనున్నారు. గతంలో ఉన్న లేత్‌మిషన్ల స్థానంలో ఆధునిక పరిజ్ఞానంతో అడ్వాన్స్‌డ్ సీఎన్‌సీ మెషినింగ్ అనే కోర్సును ప్రవేశపెట్టారు. అలాగే పరిశ్రమల్లో రోబోటిక్ వ్యవస్థపై పని చేసేందుకు వీలుగా ఇండస్ట్రియల్ మ్యాన్‌ఫాక్చరింగ్ అండ్ రోబోటిక్స్ కోర్సును అందుబాటులోకి తెచ్చారు. ఇక ఆర్టిసియన్ యూజ్ అడ్వాన్స్‌డ్ టూల్ కోర్సులో భాగంగా భవన నిర్మాణాల డిజైన్లను పూర్తిగా యంత్రాలపై చేసే విధానాలపై శిక్షణ ఇస్తారు. ఇదివరకు వెల్డింగ్ చేయాలంటే ముఖానికి అద్దం పెట్టుకోవాల్సి వచ్చేది. ఇప్పుడు దాన్ని సైతం స్క్రీన్‌పై చూస్తూ వెల్డింగ్ చేసే విధానాలపై పాఠ్యాంశంగా మార్చారు. దీనికి బేసిక్ డిజైన్ అండ్ వర్చ్యువల్ వెరిఫైర్ (మెకానికల్) కోర్సుగా నామకరణం చేశారు. ఇక చివరిది హార్డ్‌వేర్ రంగంలో ఉండే వివిధ రకాల ఎలక్ట్రానిక్ పరికరాల మరమ్మతులు, ఉత్పత్తులు చేసే విధానాలపై శిక్షణ ఇవ్వనున్నారు. ఇలా ఆరు రకాల కోర్సుల్లో ఏటా 240 మందికి అవకాశం కల్పిస్తారు. మూడు కోర్సుల శిక్షణ కాలం ఏడాది కాగా, మరో మూడు కోర్సుల శిక్షణ రెండేళ్లపాటు నిర్వహించనున్నారు. ఆగస్టు నెల నుంచి తరగతులు నిర్వహించేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. విద్యార్థులు కోర్సుల్లో చేరేందుకు ఉన్నత స్థాయి అధికారులు త్వరలో నోటిఫికేషన్ విడుదల చేయనున్నారు.



నూతనంగా నిర్మించిన అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ భవనం


రోబోలతో వాహనాల తయారీ..

ఏర్పాట్లు పూర్తి చేశాం..



ఆధునిక పద్ధతుల్లో బోధన చేసేందుకు అన్ని రకాల ఏర్పాట్లు పూర్తిచేశాం. విద్యార్థుల ప్రవేశానికి ఉన్నత అధికారుల ఆదేశాల మేరకు నోటిఫికేషన్ జారీ చేస్తాం. పది ఉత్తీర్ణులయిన వారికి అవకాశం ఉంటుంది. ఇక్కడ శిక్షణ పూర్తి చేసుకున్నవారికి వంద శాతం ఉద్యోగ అవకాశాలు ఉంటాయి.

-శ్రీనివాస్‌రావు, ప్రిన్సిపాల్ అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్


సాంస్కృతిక కార్యక్రమం దృశ్యం

సామూహిక స్ఫూర్తిని నింపిన ‘ముదిత 3.0’

పటాన్‌చెరు రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : గీతం వార్షిక ఆనందం, శ్రేయస్సుల వేడుక ‘ముదిత 3.0’ సామూహిక స్ఫూర్తిని చాటింది. హైదరాబాద్‌లోని గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయ ఆతిథ్య విభాగం బుధవారం నిర్వహించిన ఈ కార్యక్రమంలో పలువురు ఉద్యోగులు, సహాయ సిబ్బంది ఉత్సాహంగా పాల్గొని విజయవంతం చేశారు. అత్యుత్తంగా సేవలందించిన సిబ్బందికి అవార్డులను ఇచ్చి సత్కరించారు. కార్యక్రమంలో హైదరాబాద్ అదనపు ఉప కులపతి ప్రొఫెసర్ డీ.ఎస్. రావు, రెసిడెంట్ డైరెక్టర్ డీవీవీఎస్ఆర్ వర్మ, ఆతిథ్య విభాగం, క్యాంపస్ లైఫ్ డైరెక్టర్ అంబికా ఫిలిప్ తదితరులు పాల్గొన్నారు.

మహిళ పిత్తాశయం నుంచి 55 రాళ్లు తొలగింపు

మెదక్ కల్చరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని శ్రీ సాయి చంద్ర నర్సింగ్ హోమ్ డాక్టర్ పి.సురేష్, జనరల్ సర్జన్ ఆధ్వర్యంలో ఈ అరుదైన చికిత్స చేశారు. మెదక్ మండలంలోని మల్కాపూర్‌కు చెందిన తాలి(65) ఏడాదిగా తీవ్ర కడుపునొప్పితో బాధపడుతున్నది. దీంతో డాక్టర్ సురేష్‌ను ఆశ్రయించగా పిత్తాశయంలో రాళ్లు ఉన్నట్లు గుర్తించారు. దాదాపు గంటన్నర పాటు శ్రమించి ఆపరేషన్ ద్వారా 55 రాళ్లను బయటకు తీశారు. ప్రస్తుతం ఆమె ఆరోగ్యం నిలకడగా ఉంది.

న్యూస్ బాక్స్

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జిన్నారం/గుమ్మడిదల, మే 28 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కోసం 29న విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏడీఈ దుర్గాప్రసాద్, ఏఈలు రవీందర్, వెంకటేశ్వర్లు తెలిపారు. ఉమ్మడి జిన్నారం మండలంలోని ఎయిర్‌ఫోర్స్ అకాడమి, ప్రకృతి నివాస్, నల్లవల్లి, సోలక్‌పల్లి, శివానగర్ సబ్‌స్టేషన్లలో మరమ్మతుల కోసం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ నిలిపేస్తున్నామని తెలిపారు.

'విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలి'

పెద్దశంకరంపేట, మే 28 (ఆంధ్రజ్యోతి) : రైతులు విత్తనాల కొనుగోలులో జాగ్రత్తలు తీసుకోవాలని మండల వ్యవసాయా అధికారి నాగం కృష్ణ అన్నారు. బుధవారం పెద్దశంకరంపేటలో రైతులకు విత్తనాల ఎంపికపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు విత్తనాలు కొనుగోలు చేసేటప్పుడు ప్యాకింగ్‌పై వివరాలు చూసుకోవాలన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపనలు

కల్హేర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : సిర్గాపూర్ మండల పరిధిలోని వాసర్‌లో సిద్ధేశ్వర లింగ, గణపతి, నాగదేవత, నంది, పోచమ్మ విగ్రహాల ప్రతిష్ఠాపనలు బుధవారం ఘనంగా నిర్వహించారు. సాయంత్రం పోచమ్మకు బోనాలను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి పట్లోళ్ల చంద్రశేఖర్‌రెడ్డి, గ్రామస్థులు పాల్గొన్నారు.

కెరీర్ గైడెన్స్‌పై అవగాహన

పెద్దశంకరంపేట, మే 28 (ఆంధ్రజ్యోతి) : పెద్దశంకరంపేటలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో పదో తరగతి పూర్తి చేసుకున్న విద్యార్థులకు భవిష్యత్‌లో ఇంటర్మీడియట్ పాలిటెక్నిక్, కెరీర్ గైడెన్స్ తదితర అంశాలపై ఎంఈవో వెంకటేశం అవగాహన కల్పించారు. బుధవారం పేటలోని జిల్లా పరిషత్ బాలికలు ఉన్నత పాఠశాలలో పదవ తరగతిలో అత్యుత్తమ మార్కులు సాధించిన రాధవి, అఖిల, సరళ, పలువురు విద్యార్థులను ఉపాధ్యాయ సిబ్బంది శాలువాలతో సన్మానించారు.

'సేంద్రియ ఎరువులు వాడండి'

నర్సాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : రసాయన ఎరువుల వాడకం తగ్గించి, సేంద్రియ ఎరువుల వాడకం పెంచాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు పేర్కొన్నారు. గురువారం మండలంలోని నత్నయపల్లి, అహ్మద్‌నగర్ గ్రామాల్లో 'రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు'లో భాగంగా రైతులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఘనంగా ఎన్టీఆర్ జయంతి



మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పిస్తున్న టీడీపీ నాయకులు

సంగారెడ్డి రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : మాజీ సీఎం దివంగత నేత నందమూరి తారకరామారావు 102వ జయంతిని బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బుధవారం సంగారెడ్డి మండలం పోతిరెడ్డిపల్లి చౌరస్తాలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీ చైర్మన్ శ్రీనివాస్ గౌడ్, టీడీపీ నాయకులు వివి.నర్సింలు, బందెన్నగౌడ్, ప్రకాష్, మల్లేషయాదవ్, సూర్యప్రకాష్, నాగేంద్ర పాల్గొన్నారు. దివంగత ముఖ్యమంత్రి, ఎన్టీఆర్ 102వ జయంతిని బుధవారం నారాయణఖేడ్‌లో ఆయన అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఎన్టీఆర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం అభిమానులు విశ్వనాథ్, మోహన్‌రెడ్డి, దుర్గయ్య, అర్థంరమేష్ మాట్లాడారు.

గెలుపోటములు సహజం

మునిపల్లి, మే 28 (ఆంధ్రజ్యోతి) : క్రీడల్లో గెలుపోటములు సహజమేనని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్, డిక్కి సౌత్ ఇండియా వైస్ ప్రెసిడెంట్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు చంటి రాహుల్ కిరణ్ అన్నారు. మండల పరిధిలోని పెద్దగోపులారంలో బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మంతూరి శశికుమార్ సహకారంతో గతనెల 23 నుంచి నిర్వహించిన కేసీఆర్ క్రికెట్ టోర్నమెంట్ క్రీడా పోటీలు ముగిశాయి. ముగింపు వేడుకలకు వారు ముఖ్య అతిథిగా హాజరై విజేతలకు బహుమతులు అందజేశారు. మాజీ ఎంపీపీ శైలజ, బీఆర్ఎస్ మండల ప్రధాన కార్యదర్శి మంతూరి శశికుమార్ పాల్గొన్నారు.

30న ఆలయ వార్షికోత్సవం

నారాయణఖేడ్, మే 28 (ఆంధ్రజ్యోతి): ఖేడ్ పట్టణ శివారులోని శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి ఆలయ 21వ వార్షికోత్సవాన్ని రాంపూర్ పీఠాధిపతి మాధవానంద సరస్వతీస్వామి ఆశీస్సులతో 30న నిర్వహించనున్నట్లు ఆలయ వ్యవస్థాపకులు, అర్చకులు చిన్నిమధుకర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇందులో భాగంగా స్థాపిత దేవతా విగ్రహాలకు అభిషేకం, సత్యనారాయణ స్వామి వ్రతం, స్వామి వారికి సామూహిక పుష్పార్చన తదితర పూజలు నిర్వహిస్తామన్నారు.

ఆదర్శంగా రుద్రారం జిల్లా పరిషత్ పాఠశాల

- రూ.16 కోట్లతో నూతన భవనం.. మౌలిక వసతులు
- కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు
- కేజీ నుంచి పీజీ వరకు ప్రభుత్వ విద్యాసంస్థల్లో ఉచిత విద్య
- ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి



నిర్మాణ నమూనాను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పటాన్‌చెరు రూరల్, మే 28 (ఆంధ్రజ్యోతి) : రుద్రారం గ్రామ పరిధిలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలను రూ.16 కోట్ల సీఎస్ఆర్ నిధులతో తెలంగాణలోనే ఆదర్శ పాఠశాలలుగా తీర్చిదిద్దబోతున్నట్లు పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలిపారు. బుధవారం రుద్రారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలను స్థానిక మాజీ ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, లాటిక్రేట్ సంస్థ ప్రతినిధులతో కలిసి పరిశీలించారు. పాఠశాల నిర్మాణ ప్లాన్, మౌలిక వసతుల కల్పనపై చర్చించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రుద్రారం గ్రామ పరిధి నుంచి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ పాఠశాల భవనాలను ఆధునిక సాంకేతికతో నిర్మించబోతున్నట్లు తెలిపారు. లాటిక్రేట్ పరిశ్రమ సహకారంతో రూ.16 కోట్ల అంచనా వ్యయంతో ప్రముఖ ఆర్కిటెక్చర్ కృతిక సంస్థ ద్వారా ఆధునిక వసతులతో నిర్మించనున్నట్లు తెలిపారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను మూడు ఎకరాల 34 గుంటల స్థలంలో 43,378 చదరపు అడుగుల విస్తీర్ణంతో 15 తరగతి గదులు, మండల పరిషత్ పాఠశాలను ఒక ఎకరా 23 గుంటల స్థలంలో 26,586 చదరపు అడుగుల విస్తీర్ణంలో 10 తరగతి గదులు నిర్మించబోతున్నట్లు తెలిపారు. వీటితోపాటు ఫుట్‌బాల్, బ్యాడ్మింటన్, కబడ్డీ కోర్టులను నిర్మించబోతున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలోని ప్రతి విద్యార్థి ప్రభుత్వ పాఠశాలలో విద్యనభ్యసించేలా పాఠశాలను నిర్మిస్తున్నట్లు చెప్పారు. ఇందుకు గ్రామంలోని తల్లిదండ్రులు పాఠశాల బృందానికి సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. త్వరితగతిన పాఠశాల నిర్మాణం పనులు పూర్తిచేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకొని వస్తామన్నారు. అనంతరం ముత్తంగి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రూ.60 లక్షలతో నాలుగు అదనపు తరగతి గదులు నిర్మించబోతున్నట్లు ఎమ్మెల్యే తెలిపారు. బుధవారం ముత్తంగి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సుధీర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ పాండు, మాజీ ఎంపీటీసీలు రాజు, హరిప్రసాద్ రెడ్డి, మండల విద్యాశాఖ అధికారి నాగేశ్వర్‌నాయక్, లాటిక్రేట్ సంస్థ ప్రతినిధి రోహిత్, తదితరులు పాల్గొన్నారు.

మల్లెచెరువు సుందరీకరణపై దృష్టిసారించాలి

- మెదక్ కలెక్టర్ రాహుల్‌రాజ్



రెవెన్యూ సదస్సులపై సూచనలు ఇస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

రామాయంపేట, మే 28 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మల్లెచెరువు సుందరీకరణకు చేపట్టాల్సిన పనులపై దృష్టిసారించాలని మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్ అధికారులకు సూచించారు. బుధవారం సిద్దిపేట రూట్‌లోని చెరువు కట్టపై తిరిగారు. అసంపూర్తిగా కంకర వేసి వదిలేసిన పనుల తీరును పరిశీలించారు. అనంతరం అధికారులతో మాట్లాడుతూ ఇందుకు కావాల్సిన నిధుల ప్రణాళిక తయారు చేయాలన్నారు. అంతకుముందు కలెక్టర్ తహసీల్ కార్యాలయంలో రెవెన్యూ సదస్సులపై సిబ్బందికి సూచనలు, సలహాలు ఇచ్చారు. వచ్చేనెల 3 నుంచి 20 వరకు రెవెన్యూ సదస్సులు ఏర్పాటు చేయనున్నట్లు ప్రకటించారు. ఇందుకు సంబంధించిన ప్రక్రియపై తహసీల్దార్ రజనీకి కలెక్టర్ పలు సూచనలు చేశారు.

చదువు పట్ల ఆసక్తి కలిగేలా విద్యాబోధన చేయండి

- మెదక్ డీఈవో రాధాకిషన్



ఉపాధ్యాయులకు జరుగుతున్న శిక్షణ తీరును పరిశీలిస్తున్న డీఈవో రాధాకిషన్

మెదక్ అర్బన్, మే 28 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువు పట్ల ఆసక్తి కలిగేలా సాంకేతికతను జోడించి విద్యాబోధన చేయాలని డీఈవో రాధాకిషన్ ఉపాధ్యాయులకు సూచించారు. బుధవారం స్థానిక ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో జరుగుతున్న రెండో విడత భౌతిక రసాయన శాస్త్ర ఉపాధ్యాయులు శిక్షణ శిబిరాన్ని ఆకస్మికంగా సందర్శించి, పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా డీఈవో మాట్లాడుతూ అన్ని పాఠశాలల్లో ఐఎఫ్‌టీ ప్యానల్స్ అందుబాటులో ఉన్నాయని, వాటిని ఉపయోగించి ఆర్టిఫిషియల్ ఇంటలిజెన్స్, సాంకేతికతను జోడించి బోధించాలన్నారు. అంతకుముందు డైట్ కళాశాలలో నిర్వహిస్తున్న జీవశాస్త్ర ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని సందర్శించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో రాజిరెడ్డి, కోర్సు కోఆర్డినేటర్, హెచ్ఎం రేఖ, రిసోర్స్ పర్సన్‌లు తదితరులు పాల్గొన్నారు.

అపోహలొద్దు.. అందుబాటులో రాయితీ విత్తనాలు

- ఆత్మకమిటీ చైర్మన్ ప్రభు



కొండాపూర్‌లో విత్తనాలను అందజేస్తున్న ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు, వ్యవసాయాధికారులు

కొండాపూర్/నారాయణఖేడ్/కల్హేర్/హవేళిఘణపూర్/నర్సాపూర్ మే 28 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న విత్తనాలపై అపోహలొద్దని, రైతులకు సరిపడా సబ్సిడీ విత్తనాలు అందుబాటులో ఉన్నాయని సంగారెడ్డి ఆత్మ కమిటీ చైర్మన్ ప్రభు తెలిపారు. బుధవారం కొండాపూర్ వ్యవసాయశాఖ కార్యాలయంలో రైతులకు సబ్సిడీ విత్తనాలను అందజేసి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఏవో గణేష్, ఏఈవో రవి, ప్రేమ్‌రాజ్, సొసైటీ సీఈవో సిరాజ్, ఆత్మ కమిటీ డైరెక్టర్ రాజు, రైతులు పాల్గొన్నారు. నారాయణఖేడ్‌లోని వ్యవసాయ కార్యాలయంలో జీలుగ విత్తనాలను ఏడీఏ నూతన్‌కుమార్ బుధవారం పంపిణీ చేశారు. కల్హేర్ మండలంలోని ఆగ్రోస్ సేవా కేంద్రంలో మండల వ్యవసాయ అధికారి వెంకటేశం రైతులకు జీలుగ విత్తనాలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ చైర్మన్ వీరశెట్టి, మాజీ వైస్ చైర్మన్ బాల్‌రెడ్డి, ఎంపీపీ మాజీ కోప్షన్ సభ్యుడు ఎండీ.సర్దార్ పాల్గొన్నారు. అలాగే హవేళిఘణపూర్ మండలంలోని ఆగ్రో సేవా కేంద్రంలో జీలుగ విత్తనాలను మండల వ్యవసాయాధికారి బాల్‌రెడ్డి బుధవారం పంపిణీ చేశారు. నర్సాపూర్ మండలం నత్నయపల్లి సమీపంలోని వ్యవసాయ పరిశోధనా కేంద్రంలో జనుము విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కేంద్రం ఇన్‌చార్జి, సైంటిస్టు శోభ పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 9440632805 నంబరుకు సంప్రదించాలని సూచించారు.

పైలట్ ప్రాజెక్టును పకడ్బందీగా నిర్వర్తించాలి : అదనపు కలెక్టర్



రెవెన్యూ కార్యాలయంలో అధికారులకు సూచనలిస్తున్న మాధురి

కొండాపూర్, మే 28 (ఆంధ్రజ్యోతి) : భూభారతి చట్టం పైలట్ ప్రాజెక్ట్ కొండాపూర్ మండల రెవెన్యూ గ్రామాల్లో భూ సమస్యలను పకడ్బందీగా పరిష్కరించాలని సంగారెడ్డి అదనపు కలెక్టర్ మాధురి రెవెన్యూ అధికారులకు, సదస్సుల బృందాలకు సూచించారు. బుధవారం కొండాపూర్ రెవెన్యూ కార్యాలయాన్ని ఆర్డీవో రవీందర్‌రెడ్డితో కలిసి సందర్శించారు. రెవెన్యూ సదస్సులో స్వీకరించిన దరఖాస్తుల వివరాలు, బృందాల అధికారుల క్షేత్రస్థాయి పర్యవేక్షణ, సమస్యలపై సమాచారం, నివేదికలు, తీసుకున్న చర్యలు తదితర విషయాలపై ఆరాతీశారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీంచిన అనంతరం తహసీల్దార్ ఉన్నతాధికారులకు అప్రూవల్‌కు పంపాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్ అశోక్, సదస్సు బృందాల అధికారులు, డీటీలు మల్లేశం, ప్రదీప్, ఆర్ఐలు రాజు, రాంచందర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

'క్షయ'ను పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యం

- ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో గాయత్రీదేవి



కంది పీహెచ్‌సీలో క్షయ నివారణ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో గాయత్రీదేవి

కంది, మే 28 (ఆంధ్రజ్యోతి) : క్షయవ్యాధిని పూర్తిగా నిర్మూలించడమే తమ వైద్య బృందం లక్ష్యమని ఇన్‌చార్జి డీఎంహెచ్‌వో గాయత్రీదేవి అన్నారు. మండల కేంద్రమైన కందిలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో బుధవారం ఆమె వైద్యాధికారులతో కలిసి క్షయ నివారణ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. 60 ఏళ్ల పైబడిన వృద్ధులు, మధుమేహం, రక్తపోటు, క్యాన్సర్ రోగులకు ఈ వ్యాధి ఎక్కువగా వచ్చే అవకాశం ఉదన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ పీహెచ్‌సీల్లో క్షయ మందుల ఉచితంగా అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ సీహెచ్.అరుణకుమారి, డాక్టర్ శశంక్ దేశ్‌పాండే, డాక్టర్ స్నేహ శుక్లా, డాక్టర్ సాయిశంకర్, వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

- ఫర్టిలైజర్ దుకాణాల్లో తనిఖీలు



జహీరాబాద్ : తనిఖీ చేస్తున్న పోలీసులు

జహీరాబాద్/నాగల్‌గిద్ద/చిన్నశంకరంపేట/జోగిపేట/హత్నూర/నిజాంపేట/కంగ్టి, మే 28 (ఆంధ్రజ్యోతి) : ఖరీఫ్ సీజన్ ప్రారంభంకానున్న నేపథ్యంలో ఆయా ఎరువుల దుకాణాల నిర్వాహకులు విత్తనాలు, ఎరువులను అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని వ్యవసాయశాఖ అధికారి లావణ్య, ఎస్ఐ కాశీనాథ్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని హుగ్గెల్లి, పట్టణంలోని సుభాష్‌గంజ్‌లో పలు ఎరువుల దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆయా కార్యక్రమాల్లో ఎరువుల దుకాణాల నిర్వాహకులు, ట్రైనీ ఎస్ఐ సుజిత్, తదితరులు పాల్గొన్నారు. నాగల్‌గిద్ద మండలం కేంద్రంలోని పలు ఫర్టిలైజర్ దుకాణాల్లో వ్యవసాయ ఏవో ప్రవీణ్‌చారి బుధవారం తనిఖీ చేశారు. ఆయన వెంట ఎస్ఐ సాయిలు, డీలర్లు ఉమేష్‌పటేల్, దత్తు, జనార్థన్‌రెడ్డి ఉన్నారు. చిన్నశంకరంపేట మండల కేంద్రంతో పాటు గవ్వలపల్లి, శాలిపేట, ఖాజాపూర్ గ్రామాల్లోని ఫర్టిలైజర్ షాపులను ఎస్ఐ నారాయణగౌడ్ వ్యవసాయ అధికారులతో కలిసి తనిఖీ చేసి, రికార్డులను పరిశీలించారు. జోగిపేటలోని పలు ఎరువులు, పురుగుల మందుల దుకాణాలను ఎస్ఐ పాండు, ఏవో శ్రీహరి, హత్నూర మండల పరిధిలోని దౌల్తాబాద్‌లో గల పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఎస్ఐ శ్రీధర్‌రెడ్డి పరిశీలించారు. నిజాంపేట మండల కేంద్రంలోని పలు విత్తన దుకాణాలను వ్యవసాయ అధికారి సోమలింగారెడ్డి అధికారులతో కలిసి పరిశీలించారు. మండల కేంద్రమైన కంగ్టిలోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను ఎస్ఐ దుర్గారెడ్డి, ఏఈవో సంతోష్ తనిఖీ చేసి, రికార్డులు, విత్తనాలు, ఎరువులను పరిశీలించారు.

జహీరాబాద్‌లో మోస్తరు వర్షం



జహీరాబాద్‌లో కురుస్తున్న వర్షం



నీటి మునిగిన ఐటీఐ కళాశాల ప్రాంగణం

జహీరాబాద్, మే 28 (ఆంధ్రజ్యోతి) : జహీరాబాద్ ప్రాంతంలో బుధవారం సాయంత్రం మోస్తరు వర్షం కురిసింది. ఇదే తరహాలో మరో నాలుగైదురోజుల పాటు వర్షాలు కురిస్తే రైతులు పొలాల్లో విత్తనాలను వేసుకునేందుకు సిద్ధమవుతున్నారు. ఈ పాటికే కొందరు రైతులు విత్తనాలు, ఎరువులను సమకూర్చుకోగా.. మరికొందరు ఆయా దుకాణాల చుట్టూ తిరుగుతున్నారు. పట్టణంలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీలు అస్తవ్యస్తంగా ఉండడంతో మురుగునీరు, వర్షపు నీరు రోడ్లపై ప్రవహిస్తున్నది.

తూప్రాన్‌లో తడిసిన ధాన్యం

తూప్రాన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : తూప్రాన్ మండలంలో మూడురోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తూప్రాన్ పట్టణంలో సొసైటీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రం వద్ద ధాన్యం తడిసిపోయి మొలకలు వచ్చాయి.

అంత్వార్ వాగులో వరదనీరు

నారాయణఖేడ్, మే 28 (ఆంధ్రజ్యోతి): నారాయణఖేడ్ ప్రాంతంలో బుధవారం తెల్లవారుజాము వరకు భారీ వర్షం కురిసింది. వరద నీరు ఉధృతంగా ప్రవహించడంతో అంత్వార్ వాగులో భారీగా వరద నీరు చేరింది. నారాయణఖేడ్ లో 46 మి.మీల వర్షపాతం నమోదు కాగా, కల్హేర్‌లో 48.4 మి.మీ, మనూరులో 52.4 మి.మీ, నాగల్‌గిద్దలో 56 మి.మీ, సిర్గాపూర్‌లో 15.2 మి.మీలు, నిజాంపేటలో 48.8 మి.మీల వర్షపాతం నమోదైంది.

ఇళ్లల్లోకి చేరిన వర్షపునీరు

రామచంద్రాపురం టౌన్, మే 28 (ఆంధ్రజ్యోతి) : రామచంద్రాపురం, భారతీనగర్ డివిజన్ల పరిధిలో తెల్లవారుజామున కురిసిన వర్షాలకు కాలనీల్లోని ఇళ్లల్లోకి నీరు చేరింది. రామచంద్రారెడ్డినగర్ కాలనీలో జీహెచ్ఎంసీ అధికారుల బృందాలు నీటిని పంపించే విధంగా చర్యలు తీసుకున్నారు. కార్పొరేటర్ పుష్పానగేష్ కాలనీలోని లోతట్టు ప్రాంతాల్లో పరిశీలన చేశారు. రామచంద్రాపురం ఐటీఐ ప్రాంగణంలోని ద్వారం వద్ద నీరు నిలిచి విద్యార్థుల రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు. జీహెచ్ఎంసీ అధికారులు, మాన్‌సూన్ బృందం సభ్యులు ఎక్స్‌కవేటర్ సహకారంతో ప్రత్యేకంగా కాలువలు తీసి నీరు బయటకు పోయేట్టు చర్యలు తీసుకున్నారు.

పీపీ యూనిట్లలో డాక్టర్ లేరు

5వ పేజీ తరువాయి

అదనపు బాధ్యతలను అప్పగించారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆ రెండు పీపీ యూనిట్లకు రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్లను నియమించకపోవడంతో ప్రస్తుతం ఆయా విభాగాల్లో డాక్టర్ల కుర్చీలు కొంత కాలంగా ఖాళీగా దర్శనమిస్తున్నాయి.

పట్టించుకోని జిల్లా వైద్యాధికారులు

కుటుంబ నియంత్రణ ఆపరేషన్లతో పాటు చిన్నారుల టీకాల నిర్వహణ బాధ్యతలను పీపీ యూనిట్ చూస్తున్నది. అయితే, సంగారెడ్డి, జోగిపేట పీపీ యూనిట్లలో రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్లు లేకపోవడంతో కుటుంబ నియంత్రణ ఆపరేషన్లలో నిర్దేశిత లక్ష్యాన్ని చేరుకోవడం లేదు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోని ఈ పీపీ యూనిట్లను సందర్శించాల్సిన డిప్యూటీ డీఎంహెచ్‌వోలు, ప్రోగ్రాం ఆఫీసర్లు, జిల్లా వైద్యాధికారులు ఇటుగా తొంగి చూడడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. సంగారెడ్డి పీపీ యూనిట్‌లో రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్లను నియమించాల్సిది పోయి ఉన్న వారిని వేరే చోటుకు డిప్యూటేషన్‌పై పంపించడం పలు విమర్శలకు తావిస్తున్నది. మెడికల్ ఆఫీసర్లు లేకపోవడంతో ఆయా యూనిట్లలో పనిచేసే ఉద్యోగుల విధులపై సంబంధిత అధికారులు, ఉన్నతాధికారుల పర్యవేక్షణ కొరవడిందని పలువురు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి పీపీ యూనిట్లలో రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్లను నియమించి కుటుంబ నియంత్రణలో లక్ష్య సాధనకు కృషి చేయాలని పలువురు కోరుతున్నారు.

హైవే ఆక్రమణలు

5వ పేజీ తరువాయి

వ్యాపారులు నిర్వహించుకునే పేదలపై కొరడా ఝులిపిస్తున్న అధికారులు, పెద్దలు ఆక్రమణలను మాత్రం పట్టించుకోవడంలేదని ఆరోపణలు ఉన్నాయి.

చిరు వ్యాపారులకు ఇబ్బందులు

హైవే రోడ్డు పక్కన వ్యాపారులు చేసుకునే పేదలపై హైవే సిబ్బంది కఠినంగా వ్యవహరిస్తున్నారు. ఒక్కొక్క సమయంలో ఇబ్బందులకు గురిచేస్తూ తొలగిస్తున్నారు. పేదలకు కనీసం ఉపాధి లేకుండా చేస్తున్నారు. హైవే పక్కన బడా వ్యక్తులు ఆక్రమణలు చేస్తే పట్టించుకోవడంలేదు. అధికారులు పేదలను, పెద్దలను ఒకే తీరుగా చూడాలి.

- కడపల రాజు, లింగారెడ్డిపేట

ఆక్రమణలు తొలగించాలని ఆదేశం

హైవే పొడవునా జరిగిన ఆక్రమణలు తొలగించాలని ఆదేశించాను. ఏదైనా పనులు చేపడితే అనుమతులు తీసుకోవాలి. అనుమతులు తీసుకోకుంటే నోటీసులు జారీచేసి చర్యలు తీసుకుంటాం.

- శ్రీనివాస్, ఎన్‌హెచ్ఏఐ పీడీ

సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఉపయోగం



కుటుంబసభ్యులకు ఎల్‌వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

వెల్దుర్తి, మే 28 (ఆంధ్రజ్యోతి) : సీఎంఆర్ఎఫ్‌తో పేదలకు ఉపయోగమని ఎమ్మెల్యే సునీతారెడ్డి అన్నారు. మండల పరిధిలోని ఆరెగూడెం గ్రామానికి చెందిన కొడే అనూషకు చికిత్స నిమిత్తం మంజూరైన రూ.1,70,000 లక్షల ఎల్‌వోసీ కాపీని బుధవారం ఆమె కుటుంబసభ్యులకు అందజేసి మాట్లాడారు. సీఎంఆర్ఎఫ్‌ను అనారోగ్య సమస్యతో బాధపడుతున్న ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆరెగూడెం మాజీ సర్పంచ్ పల్వంచ శేఖర్, నాయకులు ప్రతాప్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


'ప్రతిఒక్కరూ పరిశుభ్రతను పాటించాలి'

నారాయణఖేడ్, మే 28 (ఆంధ్రజ్యోతి) : వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించాలని స్థానిక మున్సిపల్ కమిషనర్ జగ్జీవన్ అన్నారు. బుధవారం ఖేడ్ మున్సిపాలిటీ పరిధిలోని వెంకట్‌రావు కాలనీలో నిర్వహించిన పారిశుధ్య పనులను పరిశీలించి మాట్లాడారు. ఎప్పటికప్పుడు మురుగు కాల్వల్లో మురుగు తొలగించడం వీధులు, రహదారులను శుభ్రం చేయడం పనులు కొనసాగిస్తున్నామన్నారు.

'నిత్య జీవితంలో యోగా భాగం కావాలి'

సంగారెడ్డి అర్బన్/రామాయంపేట, మే 28 (ఆంధ్రజ్యోతి) : నిత్య జీవితంలో యోగా భాగం కావాలని హోమియోపతి సీనియర్ మెడికల్ ఆఫీసర్ డా.నర్మదషిండే అన్నారు. యోగాపై అవగాహనలో బుధవారం రెండో రోజు సంగారెడ్డి ఇంద్రనగర్‌లోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ ప్రాంగణంలో హరిత యోగా కార్యక్రమంలో మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ యోగాతో సంపూర్ణ ఆరోగ్యం సాధించవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో యునాని మెడికల్ ఆఫీసర్ డా.సమీనా, హోమియోపతి ఫార్మసిస్ట్ ఎస్.రమేశ్, యోగా సంఘాల ప్రతినిధులు, యూపీహెచ్‌సీ వైద్యులు పాల్గొన్నారు. ఆయుష్ నేతృత్వంలోరామాయంపేటలో హరిత యోగా కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా పలు ప్రదేశాల్లో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో యోగా శిక్షకులు భరత్, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ రాజశేఖర్‌రెడ్డి, మాజీ కౌన్సిలర్ దేమే యాదగిరి పాల్గొన్నారు.

సైనికులకు సన్మానం



సైనికులను సన్మానిస్తున్న విశ్రాంత ఉద్యోగులు

జోగిపేట, మే 28 (ఆంధ్రజ్యోతి) : అందోలు- జోగిపేట డివిజన్ పరిధిలోని దేశ సైనికులను అందోలు మండల విశ్రాంతోద్యోగుల సంఘం ఆధ్వర్యంలో బుధవారం ఘనంగా సన్మానించారు. ఇటీవల జరిపిన ఆపరేషన్ సిందూర్ నేపథ్యంలో సైనికుల సంఘం జిల్లా అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, పెద్దన్న సంతోష్, రత్నం, నాగభూషణం, రవీందర్‌ను విశ్రాంతోద్యోగుల సంఘం అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రేమ్‌కుమార్, మనోహర్ ప్రసాద్‌జైన్ సన్మానించి, జ్ఞాపికలను అందజేశారు. ఈ కార్యక్రమంలో విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు తిమ్మిగారి పాండు రంగం, నవీన్ కుమార్ గౌడ్, భూమయ్యగుప్తా, సదాశివగౌడ్, తోట్ల రాజయ్య, గోలి శ్రీరాములు, శంకరప్ప, వెంకటేశం, వీరేశం పాల్గొన్నారు.

పోతరాజుపల్లిలో నాలుగిళ్లలో చోరీ

తూప్రాన్, మే 28(ఆంధ్రజ్యోతి): తూప్రాన్ పట్టణ పరిధి పోతరాజుపల్లిలో మంగళవారం రాత్రి నాలుగు ఇళ్లలో చోరీ జరిగింది. పోతరాజుపల్లికి చెందిన సుగుణాల శ్రీనివాస్ భార్య డెలివరీకి వెళ్లగా.. శ్రీనివాస్ మంగళవారం ఇంటికి తాళం వేసి వెళ్లాడు. ఇదే అదును గాభావించిన దుండగులు తాళం పగులగొట్టి బీరువాలో ఉన్న బంగారం, వెండి, నగదు చోరీ చేశారు. అలాగే ఆర్ఎంపీ వైద్యుడుస్వామి, ఇంట్లో అద్దెకు ఉండే సురేష్, మంగళిస్వామి ఇంట్లో అద్దెకు ఉండే వ్యక్తి ఇళ్లలో బంగారం, వెండి, నగదు, పట్టు చీరలు చోరీ చేశారు.